# వరదానము

వింధ్యాచలపర్వత మర్ధరాత్రియొక్క నిబిడాంధకారములో నల్ల దేవత విధమున నిలువబడియుండెను. అష్టభుజదేవి యొక్క మందిర శిఖరముపైన తెల్లజండాలు మందవాయుతరంగములవలన నల్లల్లాడుచుండెను. ఆ మందిరములో మిణుకుమిణుకు మను నొకదీపము.

అర్ధరాత్రి గడచెను. నిశ్శబ్దత. ఈ సమయమున నొక శ్వేతవస్త్రధారిణియగు స్త్రీ అష్టభుజదేవియెదుట జేతులుగట్టుకొని నిలువబడి యుండెను. ఆమె, ప్రౌఢముఖమండలము పసుపుపచ్చగానుండెను. భావములవలస నుచ్ఛ్వకులము ప్రకటితమగు చుండెను. ఆమె శిరము వంచిఉంచి:

'తల్లీ ! నేటి కిరువది వత్సరములనుండి నీ చరణములమీద శిరమువంచని రోజులేదు. నీవు మహారాణివి. నేను నిన్నింత సేవించినప్పటికిగూడ నామనోభిలాష బూర్తికాలేదు. నేను నిన్ను విడచి యిప్పుడెక్కడకు బోవుదును?

తల్లీ ! నేను వందలకొలది వ్రతములాచరించితిని. దేవతలకు మ్రొక్కుకొంటిని. తీర్థయాత్రలు సేవించితిని. కాని మనోరథ మీడేరలేదు. అప్పుడు నీ శరణుజొచ్చితిని. ఇప్పుడు నిన్నువిడచి యెక్కడకు బోవుదును ? నీవు సదా నీభక్తుల గోర్కెలను దీర్చితివి. నేను నీ దర్వారునుండి నిరాశపడి బోవుదునా యేమి?'

'సువామా' యీప్రకారము జాలసేపటివరకు బ్రార్థించుచుండెను. అకస్మాత్తుగా ఆమె హృదయమునకు దివ్యజ్యోతి కనిపించినది. ఆమెకండ్లు మూసుకొనిపోయినవి. చెవిలో శబ్దము వినబడెను.

'సువామా! నేనుజాల సంతోషించితిని యేమడిగెదవో అడుగుము.' 'సువామా' రోమాంచిత యయ్యెను. ఆమె హృదయము వణక నారంభించెను. నేటికి ఇరువదివత్సరముల దరువాత మహారాణి యామెకు దర్శనమిచ్చెను. ఆమె వణకుచు చెప్పెను!—

'మహారాణీ ! నే నేదైతే యడుగుదునో యది యిచ్చెదవా?'

'ఇచ్చెదను.'

'నేను చాల తపమాచరించితిని గాన పెద్ద వరదాన మడిగెదను.'

'ఏ మడిగెదవు? కుబేరునిధనమా?'

'కాదు.'

'ఇంద్రునిబలమా?'

'కాదు.'

'సరస్వతి విద్యయా?'

'కాదు.'

'కాకపోయినచో నే మడిగెదవు?'

'ప్రపంచమునం దన్నిటికంటె నుత్తమ పదార్థము.'

'అది యేమి?'

'సుపుత్రుడు.'

'కులనామమును ప్రకాశింపజేయుటకా ?'

'కాదు.'

'మాతాపితలసేవ జేయుటకా ?'

'కాదు.'

'విద్వాంసుడు, బలవంతుడు యగుటకా?'

'కాదు.'

'ఇక నీవడిగిన సుపుత్రుడు యెట్టివాడు ?'

'నాదేశమునకు దాస్యవిముక్తి చేయగలవాడు.'

'నీబుద్ధికి ధన్యవాదము! వెళ్లు. నీకోర్కె ఫలింపగలదు.'

—రావు వెంకటరంగనాయకులు.